క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



లక్ష్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముప్పు లక్ష్య ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. కర్నూల్ జిల్లా నంద్యాలలో ఈ పోటీలు జరగనున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా లక్ష్యను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు.

వెంకటాద్రిపై విశేష పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రి పై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసుడికి ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం, అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ వితరణ చేశారు.

అమ్మవార్లకు విశేషంగా తిరువీధి



అమ్మవార్లకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు విశేషంగా తిరువీధి నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంజేపజేశారు. నాదస్వర వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణలతో బేడా తిరువీధిని ఘనంగా చేపట్టారు. అమ్మవార్లకు అర్చకులు హారతులు సమర్పించారు.

సబ్బవరం డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్(2024–25)లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు ఈ నెల 7 నుంచి 9 వరకు కళాశాలలో రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ నెల 10 నుంచి 12 వరకూ రూ.100 అదనంగా అపరాధ రుసుముతో కలిపి రూ.500 చెల్లించి డిగ్రీ ఫస్టియర్‌లో చేరవచ్చని చెప్పారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5 గంటల లోపు అడ్మిషన్ల కోసం అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, జెరాక్స్ కాపీలతో కళాశాలకు హాజరు కావాలన్నారు. బీఏ హిస్టరీ-5, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్-4, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్-3, బీఎస్సీ ఫిజిక్స్-28, బీఎస్సీ బోటనీ-15, బీఎస్సీ కెమిస్ట్రీ-5 చొప్పున ఆయా కోర్సుల్లో ఖాళీ సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు 94414 00060 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దుర్గమ్మ దయ ఉంటే.. అన్నీ ఉన్నట్టే

బీచ్‌రోడ్డు: దుర్గమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని, దసరా రోజుల్లోనే కాకుండా ప్రతి రోజూ అమ్మవారిని పూజించాలని ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న దేవీ వైభవం మూడో రోజు కార్యక్రమంలో ఆయన ప్రవచించారు. శ్యామలాదేవి దండకం కోసం వివరించారు. హైందవ ధర్మం, మాతృభాషను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, రోటరీ విశాఖ ప్రతినిధి ఆర్వీఎస్ జగన్మోహన్, ప్రెసిడెంట్ బి.వినయగాంధీ, సెక్రటరీ బి.మణిమాల, కోశాధికారి ఎం.కె.కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయానికి గండి

- పెందుర్తి మండలం జంగాలపాలెంలో అనధికారిక నిర్మాణాల జోరు
- టీడీపీ సానుభూతి 'సర్పంచ్' అండతో అక్రమ కట్టడాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



జంగాలపాలెంలోని భాష్యం పాఠశాల సమీపంలో పంచాయతీ ప్లాన్ లేకుండా నిర్మిస్తున్న భారీ భవనం

పెందుర్తి: పెందుర్తి మండలం జంగాలపాలెం పంచాయతీకి ఆదాయం అంతంత మాత్రమే. అలాంటి పంచాయతీకి పారదర్శకంగా ఆదాయాన్ని సమకూర్చి.. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతారని నమ్మి ప్రజలు పట్టం కడితే.. ఆ పంచాయతీకి సక్రమంగా రావాల్సిన ఆదాయానికే గండి కొడుతున్నారు టీడీపీ సానుభూతి పరుడైన సర్పంచ్. దీని పరిధిలో జరుగుతున్న ఏ నిర్మాణానికి నిబంధన ప్రకారం ఉండాల్సిన పంచాయతీ అనుమతితో పనిలేకుండా అడ్డగోలుగా అధికారుల చేతుల కట్టేసి అతనే అనధికారిక అనుమతి ఇవ్వడం వివాదస్పదంగా మారుతోంది. పంచాయతీ ప్రథమ పౌరుడి గా తన ప్రాథమిక బాధ్యతలు మరిచి ఏకంగా ఆదాయానికే ఎసరు పెట్టడం విడ్డూరంగా ఉందని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. రెండేళ్ల కిందట పంచాయతీ నిధుల దుర్వినియోగం అభియోగం రుజువు కావడంతో చెక్ పవర్ కూడా రద్దు చేసుకున్న ఈ సర్పంచ్ తీరు మారకపోవడం గమనార్హం.

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయన కనుసన్నల్లో అనుమతి లేని నిర్మాణాల సంఖ్య మరింత పెరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. పెందుర్తి మండలం జంగాలపాలెంలో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారం ఇలా ఉంది. తాజాగా జంగాలపాలెం గ్రామంలోని సర్వే నంబర్ 202లో జరుగుతున్న భారీ నిర్మాణానికి రూ.లక్షల ఆదాయానికి సదరు సర్పంచ్, పంచాయతీ అధికారులే గండి కొట్టడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంతా అనధికారికమే..

సాధారణంగా పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణం అనుమతి విషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం మామూలే. భారీ నిర్మాణాలు చేపడితే కచ్చితంగా పంచాయతీ కార్యదర్శి ద్వారా ప్లాన్ తీసుకోవలసిందే. అది మంజూరు చేయడం వల్ల పంచాయతీలకు భారీ స్థాయిలో ఆదాయం సమకూరుతుంది. జంగాలపాలెంలో ఇటు అధికారులు.. అటు ప్రజాప్రతినిధులు నిబంధనలకు పూర్తిగా నీళ్లు వదిలేశారు. పంచాయతీకి పెద్దగా ఆదాయాన్ని సమకూర్చాల్సిన ప్రజాప్రతినిధే అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. పైగా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పంచాయతీలో సర్పంచ్‌కు ఎదురు లేకుండా పోయింది. అధికారం చేతిలో ఉండటంతో అనధికార నిర్మాణాలను దగ్గరుండి ప్రోత్సహిస్తున్నారు. పంచాయతీకి ఆదాయానికి గండి పడినా.. తమ ఆదాయానికి మాత్రం డోకా లేకుండా భారీ నిర్మాణాలకు సైతం మా వాళ్లే అంటూ చర్యలు తీసుకోకుండా అధికారుల నోరు నొక్కేస్తున్నారు. ఈ తరహాలో పంచాయతీ ఆదాయానికి స్వయంగా సర్పంచే గండి కొట్టడంతో విమర్శలు వెల్లువెత్తున్నాయి. గతంలో చెక్ పవర్ కూడా రద్దయిన ఈ సర్పంచ్ అడుగులకు అధికారులు సైతం మడుగులొత్తడంతో పరిస్థితి మరింత దిగజారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అనధికారిక నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదులు వచ్చాయి

భాష్యం పాఠశాల సమీపంలో జరుగుతున్న భవన నిర్మాణానికి పంచాయతీ అనుమతి లేదు. దీనిపై ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి, వారి అనుమతితో తదుపరి చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి

నేత్రపర్వంగా నృసింహ హోమం



నృసింహ హోమం జరిపిస్తున్న అర్చకులు



కుంభప్రోక్షణలో భాగంగా ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, పక్కన ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ తార స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం 7గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులు కంకణధారణ చేసి, హోమ గుండం వద్ద ఆశీనులయ్యారు. మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు గిరి, శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉచిత ఇసుక అమలులో ప్రభుత్వం విఫలం



ఫార్మాసిటీలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఉచిత ఇసుక హామీని అమలు చేయడంలో విఫలమైందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. భవన నిర్మాణాలు చేస్తున్న ప్రజలకు గాని, ఈ రంగంపై ఆధారపడిన కార్మికులకు గాని ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని కోరుతూ ఫార్మాసిటీలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఇసుకను అందుబాటులోకి తెచ్చి, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపడానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు పి.వీరునాయుడు, దుర్గారావు, మణి, రమణమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

అమ్మవు నీవే అఖిల జగాలకు..




అమ్మవారిని దర్శించుకుంటున్న గండి రవి, కమిటీ ప్రతినిధులు

- లోకపావని దుర్గామాతను కొలుస్తున్న భక్తులు
- నేత్రపర్వంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



ఎస్ఆర్ పురంలో గాయత్రీదేవిగా కనకదుర్గమ్మ



అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ



మహాకామేశ్వరి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పెందుర్తి: శరన్నవరాత్రి మహోత్సవాలు అంతటా కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

➡ పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న మహాకామేశ్వరీ పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా అమ్మవారికి రుద్రాభిషేకం, అఖండ క్షీరాభిషేకాలు చేశారు. గజలక్ష్మిగా జగన్మాత దర్శనమిచ్చారు. బాలోపాసన వైభవంగా నిర్వహించారు.

➡ చినముషిడివాడ పంచముఖ గాయత్రిమాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. గాయత్రిమాతగా అమ్మవారు పూజలందుకున్నారు.

➡ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో కుంకుమ పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. ధైర్యలక్ష్మిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

➡ పెందుర్తి మహాకామేశ్వరి పీఠంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు.

➡ పెందుర్తి ప్రశాంతినగర్‌లోని కనకదుర్గమ్మ గాయత్రీదేవిగా పూజలందుకున్నారు. సామూహిక సహస్ర కుంకుమార్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

➡ ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

➡ సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

దుర్గమ్మ సన్నిధిలో అన్నసమారాధన

పెందుర్తి: పినగాడిలోని ఓం శ్రీ అభయ రూపిణి ఆదిశక్తి నాగ దేవి దుర్గా భవానీ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్ ప్రారంభించారు. వెయ్యి మంది ప్రసాదం స్వీకరించారు. కమిటీ ప్రతినిధులు సతీష్, కనకరాజు, సిద్ధూ తదితరులతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పెందుర్తిఆలయంలో గాయత్రీదేవిగా అమ్మవారు



శ్రమశక్తినగర్‌లో గాయత్రిమాతగా (స్వీయావతారం) అమ్మవారు



సుజాతనగర్‌లో అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ

అన్నపూర్ణే.. సదాపూర్ణే..

సింహాచలం: దుర్గాదేవి అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. అడవివరంలోని హవేలి ప్రాంగణంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉదయం చండీ హోమం, శ్రీ చక్రార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం కుంకుమ పూజలు విశేషంగా జరిగాయి. మహిళలు పాల్గొన్నారు.

కంటి వైద్య సేవల్లో శంకర్ ఫౌండేషన్ అద్భుత ప్రగతి



శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు కంటి వైద్య సేవల్లో అద్భుతమైన ప్రగతి సాధించిందని డీజీఎం కె.బంగార్రాజు శనివారం తెలిపారు. గడిచిన ఆరు నెలల కాలంలో మొత్తం 15,714 శస్త్రచికిత్సలు, వివిధ పథకాల కింద 13,194 కంటి శుక్లం ఆపరేషన్లు నిర్వహించినట్లు చెప్పారు. లక్షకు పైగా రోగులకు కంటి వైద్య పరీక్షలు చేశామన్నారు. సామాజిక ఔట్‌రీచ్‌లో భాగంగా 276 ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కుగ్రామాల్లో నిర్వహించి 17,612 కంటి వైద్య పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. 1997లో ఆస్పత్రిని స్థాపించిన నాటి నుంచి 2024 సెప్టెంబర్ వరకు 26,66,463 మందికి 4,58,297 కంటి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. హాస్పిటల్ బ్రాంచ్ శ్రీకాకుళంలో 11,567 మందికి పరీక్షలు చేసి 2,917 శస్త్రచికిత్సలు చేశామన్నారు. మద్దిలపాలెం శాఖలో 8,067 మందికి ఓపీ స్క్రీనింగ్, 699 మందికి శస్త్రచికిత్సలు, గాజువాక శాఖలో 6,601 మందికి ఓపీ స్క్రీనింగ్, 161 మందికి శస్త్రచికిత్సలు, మధురవాడ శాఖలో 3,747 మందికి ఓపీ స్క్రీనింగ్, 68 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వివరించారు. నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించడంలో శంకర్ ఫౌండేషన్ ప్రజలకు మరింత చేరువైందని జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, వైద్యులను అభినందించారు.

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన



బయో డైవర్సిటీ పార్కు నిర్వహణ కమిటీ సభ్యులతో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

ఎంవీపీకాలనీ: పెదవాల్తేర్ ఆర్‌సీడీ హాస్పిటల్ ప్రాంగణంలోని బయో డైవర్సిటీ పార్కును శనివారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సందర్శించారు. ఆయనకు పార్కు నిర్వాహకుడు ఎం.రామమూర్తి, నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పార్కు నిర్వహణ, అక్కడ అందుబాటులో ఉన్న వినూత్న మొక్కలు, ఎడ్యుకేషన్ యాక్టివిటీస్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. వైవిధ్యమైన మొక్కలను ఆసక్తిగా తిలకించారు. పార్కులో అన్ని విభాగాలను పరిశీలించి పలు మొక్కల విశిష్టతను తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా అరుదైన జాతికి చెందిన అంజీర్ ఫికస్ కారికా మొక్కను పార్కులో నాటారు. పార్కు అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని నిర్వాహకులకు కమిషనర్ విశ్వనాథన్ మాటిచ్చారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ డీఎస్‌వో శాంతిస్వరూప్, ఎఫ్ఆర్‌వో శ్యామల, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, పార్కు నిర్వహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్క్రాప్ వాహనాలపై నిర్లక్ష్యం వద్దు



ముడసర్లోవలో వాహన రిపేర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఆరిలోవ: జీవీఎంసీకి చెందిన స్క్రాప్ వాహనాలపై నిర్లక్ష్యం వహించవద్దని ఇంజినీరింగ్ అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సూచించారు. ముడసర్లోవ వద్ద జీవీఎంసీ వాహన రిపేర్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ జీవీఎంసీకి చెందిన పాడైన వాహనాలు, ప్రమాదానికి, మరమ్మతులకు గురైన వాహనాలను పరిశీలించారు. కుప్పలుగా పడి ఉన్న వాటిని చూసిన జీవీఎంసీ కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలను ఏళ్ల తరబడి ఎందుకు నిల్వ ఉంచాల్సి వచ్చిందని, మరమ్మతులకు గురైన వాటికి రిపేర్లు ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. వాటికి సంబంధించిన వివరాలతోపాటు ఇంటింటి నుంచి వ్యర్థాలు సేకరిస్తున్న వాహనాల వివరాలను వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ వాహనాలకు సంబంధించిన ఇంధన వినియోగం, ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఏన్యువల్ మెయింటినెన్స్ కాంట్రాక్ట్ ఖర్చును తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన వైద్యాధికారి, మెకానికల్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్లు సంయుక్తంగా జోనల్ స్థాయిలో ప్రక్షాళన చేస్తూ జీవీఎంసీకి ఆర్థిక నష్టం కలగకుండా ప్రణాళికాయుతంగా ఖర్చును నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అన్నదానం



ఎరుకునాయుడుపాలెంలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న భవానీ మాలధారులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి శివారు ఎరుకునాయుడుపాలెంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణమ్మ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఎంపీటీసీ కర్రి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మొల్లి చిన్నారావు, కరణం సురేష్, కాపుశెట్టి నీలమణి, కర్రి హరికృష్ణ, మడక నాయుడు, జి.కనకరాజు, గనిరెడ్డి సింహాచలం నాయుడు, దాలిబోయిన నారాయణరావు, భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బాణసంచా తయారీకి అనుమతులు తప్పనిసరి



గుల్లేపల్లి బాణసంచా తయారీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రమణ

సబ్బవరం: అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ హెచ్చరించారు. రానున్న దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ఆయన స్థానిక సీఐ పిన్నంటి రమణతో కలిసి శనివారం మండలంలోని పలు గ్రామాల్లో గల బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మల్లునాయుడుపాలెం, మొగలిపురం, గుల్లేపల్లి, గంగవరం గ్రామాల్లో నలుగురికి మాత్రమే బాణసంచా తయారీకి అనుమతులు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల్లో పరిమితికి మించి తయారీ సామగ్రి లేనట్లు గుర్తించామని చెప్పారు. నైపుణ్యం గలవారు మాత్రమే బాణసంచా తయారీ చేయాలని, మైనర్లను క్రేకర్స్ తయారీకి వినియోగించరాదని సూచించారు. జనావాసాల మధ్యలో బాణసంచా తయారీ చేసినా, నిల్వ ఉంచినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, జనావాసాల మధ్య నిల్వ చేసిన వారిపై స్థానికులు సమాచారం అందిస్తే వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు తగు చర్యలు తీసుకుంటామన్నారు. పండగల సమయంలో ఇళ్లు విడిచి క్యాంప్‌లకు వెళ్లేవారు విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. తమకు ముందస్తు సమాచారం అందిస్తే లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో దసరా, దీపావళి పండగలు జరుపుకోవాలని డీఎస్పీ సత్యనారాయణ ఆకాంక్షించారు. తనిఖీల్లో ఎస్ఐ జి.ధనుంజయ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

బీచ్‌రోడ్డు: జూనియర్లపై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి హెచ్చరించారు. ఏయూ అంతర్జాతీయ హాస్టల్స్ విద్యార్థులకు శనివారం ర్యాగింగ్, గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అలవాటు చేసుకొని జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి వినియోగం, విక్రయాలు జరిగితే తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు, యూనివర్సిటీకి మంచి పేరు తీసుకొని రావాలని ఏసీపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మూడో పట్టణ సీఐ పల్లా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.